మానేరు
# జనత
తెలుగు దినపత్రిక   ఇది జనం గొంతుక

16.09.2024
సోమవారం monday
సంపుటి (Volume): 09
సంచిక (Issue) : 157
పేజీలు : 8
Pages : 8
వెల: 5
Published from : Rangareddy, Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad,

## విరిగిన చేయితో బరిలో దిగి..
సెంటీ మీటర్ తేడాతో.. టైటిల్ మిస్సయిన నీరజ్ చోప్రా
డైమండ్ లీగ్ ఫైనల్లో రన్నర్‌పతో సరి




4

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

ఔత్సాహికులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



హుస్సేన్‌సాగర తీరాన నిమజ్జనానికి
## తొలగిన అడ్డంకులు

అధికారులు అనుమతివ్వకుంటే
ఎక్కడి విగ్రహాలు అక్కడే..
గణేశ్ ఉత్సవ సమితి హెచ్చరిక
ట్యాంక్‌బండ్‌పై ఫ్లెక్సీల తొలగింపు
దిగొచ్చిన అధికార యంత్రాంగం
ఖైరతాబాద్ గణపతి దర్శనానికి
ఒక్కరోజే 6 లక్షల మంది రాక
ట్రాఫిక్‌జాం.. సొమ్మసిల్లిన కొందరు

జనతా న్యూస్: హైదరాబాద్ : గణనాథుల 'నిమజ్జనం'పై గందరగోళానికి తెరపడింది. విగ్రహాలను తన మీదుగా గంగమ్మ ఒడికి చేర్చడానికి తావు లేదని బెట్టు చేసిన ట్యాంక్‌బండ్ ఎట్టకేలకు గణపతులకు స్వాగతం పలికింది. ఈసారి కూడా మహా నిమజ్జనం ట్యాంక్‌బండ్ నుంచి ఆర్భాటంగా జరగనుంది. హైకోర్టు ఆదేశాల మేరకు ట్యాంక్‌బండ్ నుంచి నిమజ్జనానికి

మిగతా 2 లో

# మా క్యాడర్ జోలికి వస్తే ఒళ్లు చింతపండే

## మనవాళ్ల ఇంటికి వస్తామని వాళ్లే అన్నారు
## తీరా మనవాళ్లే వెళ్తే.. తన్నారంటున్నారు



చూసుకుందాం రమ్మని ఎందుకు పిలిచినట్లు?
రాజీనామా చేస్తానన్న సన్నాసి ఏమయ్యాడు?
మహేశ్‌గౌడ్ టీపీసీసీ చీఫ్ కావడం సంతోషకరం
ఇద్దరం సమన్వయంతో పనిచేస్తాం: సీఎం రేవంత్
మహేశ్‌గౌడ్ బాధ్యతల స్వీకారంలో వ్యాఖ్యలు



జనతా న్యూస్: హైదరాబాద్ : రాష్ట్రంలో బీసీ జనాభా లెక్కలు తేలాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బీసీ కమిషన్ ద్వారా రానున్న మూడు, నాలుగు నెలల్లో బీసీ జనాభా లెక్కలు తీస్తామని, ఆ వర్గాలకు దక్కాల్సిన

మిగతా 2 లో



## 'బీమాపై జీఎస్టీ'ని సమీక్షించేందుకు
### మంత్రివర్గ ఉపసంఘం
భట్టి విక్రమార్క, ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్‌కు చోటు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియాలపై జీఎస్టీని సమీక్షించి, రేట్ల సవరణకు సూచనలు ఇచ్చేందుకు జీఎస్టీ కౌన్సిల్ ఆదివారం 13 మంది సభ్యులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఈ కమిటీకి బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సహా పలు రాష్ట్రాలకు చెందిన 12 మంది ఆర్థిక మంత్రులు/ఆర్థికశాఖను పర్యవేక్షిస్తున్న సీఎం/డిప్యూటీ

మిగతా 2 లో



## రాజీనామా చేస్తా
పదవి నుంచి తప్పుకొంటానని
ఢిల్లీ సీఎం కేజ్రీ ప్రకటన

ఇది నాకు నేను విధించుకునే అగ్నిపరీక్ష
పార్టీని చీల్చేందుకు బీజేపీ కుట్రలు
దేవుడు అండగా ఉండి రక్షించాడు
నిర్దోషిగా నిరూపించుకునే వరకు
ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోను
నవంబరులోనే ఎన్నికలు నిర్వహించాలి
సీఎం పదవిని ప్రజాకోర్టు నిర్ణయిస్తుంది

2

# రేవంత్ పదవిలో ఉండేది ఐదేళ్లే

## పార్టీ నడుపుతున్నారా? సర్కస్సా?

### సన్నాసి, లిల్లీపుట్ అని అనలేనా?
ఒకే అంశంపై ముఖ్యమంత్రి, మంత్రులది తలో మాట
నా ఎత్తును పదేపదే విమర్శిస్తే.. నేను లిల్లీపుట్ అనలేనా
సీఎం రేవంత్‌పై హరీశ్ రావు ధ్వజం

జనతా న్యూస్: హైదరాబాద్ : : ఒకే అంశంపై ముఖ్యమంత్రి ఓ మాట, మంత్రులు మరో మాట్లాడుతుండడం చూస్తుంటే.. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పార్టీ నడుపుతున్నారా? లేదా సర్కస్ నడుపుతున్నారా? అనే సందేహం కలుగుతుందని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ గాంధీ భవన్‌లో మాట్లాడిన మాటలు, ఉపయోగించిన భాషపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్థానానికి ఉన్న గౌరవాన్ని రేవంత్ తగ్గిస్తున్నారని విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని

మిగతా 2 లో






విమోచన దినోత్సవమే
## జరపాలి
'ప్రజాపాలన'లో భాగస్వామిని కాలేను
సీఎంకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

జనతా న్యూస్: హైదరాబాద్ : సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా కాకుండా, తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాపాలన దినోత్సవం పేరిట నిర్వహించే కార్యక్రమానికి తాను రాలేనని స్పష్టంచేశారు. సెప్టెంబర్ 17న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న

మిగతా 2 లో

## యుద్ధ ప్రాతిపదికన గండ్లకు మరమ్మతు

వారం రోజుల్లో పనులు పూర్తి
కేంద్రం సహకరిస్తుందనే ఆశ
వారు నిధులిచ్చినా.. ఇవ్వకున్నా
రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేస్తాం
కాళేశ్వరంపై బీఆర్ఎస్‌ది
నిస్సిగ్గు సమర్థన: మంత్రి ఉత్తమ్
కోదాడ, హుజూర్‌నగర్‌లో
దెబ్బతిన్న కాల్వల పరిశీలన



.. వివరాలు 2లో

## ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ పేరునా మోసం..



సభ్యత్వం,మహాసభ,కాన్ఫరెన్స్ పేరిట రూ.కోట్లలో వసూళ్లు..?
మోసం చేసిన టంగుటూరి రామకృష్ణ,వనపర్తి మల్లికార్జునపై పోలీసులకు పిర్యాదు
చట్టపరమైన చర్యలుతీసుకోవాలని ఏసిపిఎస్ ప్రేమ్ గాంది డిమాండ్

.. వివరాలు 8లో

# మా క్యాడర్ జోలికి వస్తే ఒళ్లు చింతపండే



మొదటి పేజీ తరువాయి

వాటా ఇచ్చి.. ఎన్నికలు నిర్వహిస్తామని అన్నారు. టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా నియమితుడైన బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఇందిరాభవన్ ఆవరణలో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బీసీ నేత అయిన మహేశ్‌కుమార్‌గౌడ్.. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడం తామందరికీ సంతోషం కలిగిస్తోందన్నారు. 2023 ఎన్నికలు సెమీఫైనల్స్ మాత్రమేనని, 2029 పార్లమెంటు ఎన్నికలు ఫైనల్స్ అని సీఎం అభివర్ణించారు.

ఆ ఎన్నికల్లో కాంగ్రెసను గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. ఎవరైనా తమ కార్యకర్తల జోలికివస్తే ఊరుకోబోమని, కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇక.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కారణమైన కార్యకర్తలను సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, జడ్పీ చైర్మన్లు, ఎంపీపీలు, మునిసిపల్ చైర్మన్లుగా గెలిపించుకునే బాధ్యత తనపైనా, మహేశ్‌కుమార్‌గౌడ్ పైనా ఉందన్నారు. ఈ విషయంలో తామిద్దరమూ సమన్వయం చేసుకుని ముందుకుపోతామని తెలిపారు. ఇప్పటిదాకా జరిగిన ఎన్నికలు నాయకులకు సంబంధించినవని, ఇకపై జరిగే ఎన్నికలు.. కాంగ్రెస్ జెండాలు మోసిన కార్యకర్తలకు సంబంధించినవని పేర్కొన్నారు. కార్యకర్తలను గెలిపించాల్సిన బాధ్యత తామందరిపైనా ఉందని, వారి గెలుపు కోసం తమ ఎన్నికల కంటే ఎక్కువగా కష్టపడతామని చెప్పారు.

**ఒక్కొక్కటిగా గ్యారెంటీల అమలు**

తాను 2021లో టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లానని, ఇంద్రవెల్లి వేదికగా సమరశంఖం పూరించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చామని రేవంత్‌రెడ్డి తెలిపారు. తానొకవైపు, భట్టి విక్రమార్క మరోవైపున పల్లె పల్లెనా పాదయాత్ర చేశామని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటప్రకారం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేశామన్నారు. రాష్ట్రంలోని 23 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.18 వేల కోట్లు వేసి వ్యవసాయం పండుగ అని నిరూపించామన్నారు. తుక్కుగూడ సభలో సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. పంద్రాగస్టు లోగా రూ.2 లక్షల మేరకు రైతు రుణమాఫీ చేస్తానని యాదగిరిగుట్ట నరసింహస్వామి సాక్షిగా ప్రకటించి.. ఇచ్చిన మాటప్రకారం భద్రాద్రి రాములవారి సాక్షిగా పంద్రాగస్టున అమలు చేశామని సీఎం రేవంత్ అన్నారు. "పంద్రాగస్టు కల్లా రూ.2 లక్షల రుణమాఫీ అమలైతే రాజీనామా చేస్తానని బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు సవాల్ చేశాడు.

ఆ సన్నాసి ఇప్పుడు ఎక్కడ దాక్కున్నాడు?" అని ప్రశ్నించారు. రూ.2 లక్షల పైన రుణం ఉన్న రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రూ.2 లక్షల పైన ఉన్న రుణాన్ని బ్యాంకులో చెల్లించాలని, మరుక్షణమే ఆ రూ.2 లక్షలు ఆయా రైతుల ఖాతాలో వేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాబోయే పంట నుంచి సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని సీఎం ప్రకటించారు. నిరుద్యోగులకు ఇచ్చిన మాట ప్రకారం.. అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలకు సంబంధించిన నియామక పత్రాలు ఇచ్చామన్నారు. మరో 35 వేల ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్లు విడుదల చేశామని, ఈ ఏడాది చివరికల్లా ఆ ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తమదని అన్నారు. నిరుద్యోగులకు నైపుణ్యం అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామని తెలిపారు.

దేశంలో 140 కోట్ల మంది జనాభా, అందులో 50 శాతం యువత ఉన్నా.. ఒలింపిక్స్‌లో ఒక్క పతకం కూడా రాకపోవడం అవమానం కాదా? అని ప్రధాని మోదీని సీఎం ప్రశ్నించారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం దీక్ష పూనిందని, త్వరలో రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 2028 ఒలింపిక్స్‌లో దేశం తరపున బంగారు పతకాలు సాధించే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఇక రీజినల్ రింగ్ రోడ్డును తీసుకువచ్చి హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చే ప్రయత్నం చేస్తున్నామని, ముచ్చర్లలో ఫోర్త్ సిటీని అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలను జోడెద్దుల్లా ముందుకు తీసుకెళ్లేందుకుగాను పూర్తి సమయాన్ని పార్టీకి కేటాయించే అధ్యక్షుడు ఉండాలని అధిష్ఠానాన్ని తాను కోరానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అధిష్ఠానం అన్నివిధాలా ఆలోచించి బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో తనదైన పాత్ర పోషించిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను అధ్యక్షుడిగా నియమించిందన్నారు. మొన్నటి ఎన్నికల్లో గెలుపు సెమీ ఫైనల్స్ మాత్రమేనని, ఫైనల్స్ 2029లో ఉంటాయని సీఎం చెప్పారు. ప్రధాని మోదీని ఓడించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేసినప్పుడే ఫైనల్స్‌లో కాంగ్రెస్ గెలిచినట్లని వ్యాఖ్యానించారు. వచ్చే పదేళ్లూ రాష్ట్రంలో కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని, 2029 పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో 15 సీట్లు గెలిస్తేనే ఫైనల్స్‌లో గెలిచినట్లవుతుందని పేర్కొన్నారు. అప్పటివరకూ ఎవరమూ విశ్రమించవద్దన్నారు.

**కార్యకర్తల జోలికొస్తే చింతపండే**

"నిన్న.. మొన్న మన కార్యకర్తలపై దాడులు చేసే ప్రయత్నాలు జరిగినయి. మనింటికి వస్తమని చెప్పిన్రు. కానీ, మనోళ్లే వాళ్ల ఇంటికి పోయిన్రు. చింతపండు అయినాక.. మా ఇంటికి వచ్చి తన్నారని అంటున్రు. రా.. చూసుకుందామని ఎందుకు పిలిచినట్లు?" అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తమ కార్యకర్తలు ఎవరి జోలికీ పోరని, ఎవరైనా తమ మంచితనాన్ని చేతకానితనంగా తీసుకుంటే మాత్రం చింతపండు అవుతుందని హెచ్చరించారు. మహేశ్‌కుమార్ సౌమ్యుడై ఉండవచ్చని, కానీ.. ఆయన వెనకాల తానున్నానన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. "మా ఆటలు సాగుతయి.. ఊర్లలో మా ఇష్టం వచ్చినట్లు చేయవచ్చని ఎవరైనా అనుకుంటే.. ఒక్కొక్కడికి ఉంటది"అని హెచ్చరిక జారీ చేశారు.

# రాజీనామా చేస్తా



మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ సంచలన నిర్ణయాన్ని ప్రకటించారు. రెండ్రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని వెల్లడించారు. "నేను నిర్దోషిగా నిరూపించుకునేంత వరకు సీఎం పదవిలో ఉండను. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆప్‌ను గెలిపించి, అధికారం కట్టబెట్టేవరకు సీఎం పీఠాన్ని అధిరోహించను" అని వ్యాఖ్యానించారు. రాజీనామా తర్వాత.. తదుపరి సీఎంను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఆదివారం ఢిల్లీలోని ఆప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆప్ కష్టాల్లో ఉన్నప్పుడు భగవంతుడే తమ వెంట ఉండి, ముందుకు నడిపించారని, దేవుడిచ్చిన ధైర్యంతోనే శత్రువులపై పోరాడుతామని ఉద్ఘాటించారు. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సుప్రీంకోర్టు శుక్రవారం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే..! ఆర్నెల్లుగా జైలులో ఉన్న ఆయన సుప్రీంకోర్టు తీర్పుతో విడుదలయ్యారు. అప్పుడు విలేకరులతో మాట్లాడుతూ దేశాన్ని బలహీనపరుస్తూ.. విభజించే ప్రయత్నాలు చేస్తున్న శక్తులపై తాను పోరాటం చేస్తానని ప్రతినబూనారు. ఆదివారం కార్యకర్తలతో భేటీ అయ్యారు. "మా నేతలు సత్యేందర్ జైన్, అమానతుల్లాఖాన్ ఇంకాజైలులోనే ఉన్నారు. వారూ త్వరలో బయటకు వస్తారని భావిస్తున్నాను" అనే ఆశాభావం వ్యక్తం చేశారు. తన రాజీనామా తర్వాత కొత్త సీఎం ఎంపికకు పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. బీజేపీపై ఆయన తీవ్రవ్యాఖ్యలు చేశారు.

# యుద్ధ ప్రాతిపదికన గండ్లకు మరమ్మతు

మొదటి పేజీ తరువాయి




రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న కాల్వలు, చెరువులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్‌లలో దెబ్బతిన్న కాల్వలను ఉత్తమ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 773 చోట్ల కాల్వలు, చెరువులు దెబ్బతిన్నాయని.. తాత్కాలిక మరమ్మతులకు రూ.73 కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ.483 కోట్లు అవసరమని కేంద్రానికి నివేదిక ఇచ్చామని తెలిపారు. కేంద్రం నిధులు ఇచ్చినా, ఇవ్వకపోయినా మరమ్మతులను పూర్తి చేస్తామని వెల్లడించారు. నీటి పారుదలకు అవసరమైన నిధులను సీఎం కేటాయించారని, వారం రోజుల్లో పనులు పూర్తి చేసి రైతులకు నీరందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలతో రూ.10,300 కోట్ల నష్టం జరిగిందని కేంద్రానికి నివేదిక ఇచ్చామని చెప్పారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయని ఆశిస్తున్నామని తెలిపారు. నాగార్జునసాగర్ నుంచి పాలేరు జలాశయానికి నీటిని తరలించే సాగర్ ఎడమకాల్వకు కాగిత రామచంద్రాపురం వద్ద పడిన గండిని పూడ్చేందుకు రేయింబవళ్లు పని చేయాలని అధికారులను ఆదేశించారు. కోదాడలోని రెడ్ల కుంట ప్రధాన కాల్వ గండికి రెండు మూడు రోజుల్లో మరమ్మతులు చేయాలని సూచించారు. హుజూర్‌నగర్‌లోని ముక్త్యాల ప్రధాన కాల్వ కింద 1.07 లక్షల ఎకరాలకు నీరందాల్సి ఉందని, ఫ్లడ్ లైట్ల వెలుగులో వారం రోజుల్లో గండిని పూడ్చాలని ఆదేశించారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రభుత్వ యంత్రాంగం వరద సహాయక చర్యల్లో ఇంత వేగంగా స్పందించిన దాఖలాలు లేవని ఉత్తమ్ అన్నారు. వరదలు వచ్చిన గంటలోపే సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు సహాయక చర్యల్లో ఉన్నారని తెలిపారు.

**ఐదు సీఈల పరిధిలోనే భారీ నష్టం..**

వర్షాలతో ఐదు చీఫ్ ఇంజనీర్ల పరిధిలోనే భారీగా నష్టం జరిగిందని మంత్రి వెల్లడించారు. సీఈ వరంగల్ పరిధిలో 67 చోట్ల చెరువులు/కాలువలు/మత్తడి/స్లూయిసలు దెబ్బతినగా, 75 చోట్ల గండ్లు పడ్డాయని.. సీఈ ఖమ్మం పరిధిలో 106 చోట్ల, సీఈ ములుగు పరిధిలో 91 చోట్ల, సీఈ ఆదిలాబాద్ పరిధిలో 60 చోట్ల, సీఈ సూర్యాపేట పరిధిలో 49 చోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం పంప్‌హౌస్, ఖమ్మం జిల్లాలో భక్త రామదాసు పంప్‌హౌస్ దెబ్బతిన్నాయని తెలిపారు.

**ప్రకృతి వైపరీత్యాలతో రాజకీయాలు..**

ప్రకృతి వైపరీత్యాలతో నష్టం జరిగితే.. దాని ద్వారా కొంత మంది లబ్ధి పొందే ప్రయత్నం చేయాలనుకుంటున్నారని ఉత్తమ్ మండిపడ్డారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రూ.97 వేల కోట్లు వెచ్చించి.. 98 వేల ఎకరాలకే నీళ్లిచ్చారని విమర్శించారు. కాళేశ్వరం పథకం డిజైన్ చేసింది, కట్టింది.. బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని.. అది కూలింది కూడా వారి హయాంలోనేనని పేర్కొన్నారు. సిగ్గులేకుండా కాళేశ్వరం పథకాన్ని సమర్థించుకుంటున్నారని మండిపడ్డారు. రూ.27 వేల కోట్లు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో వెచ్చిస్తే.. ఒక్క ఎకరం కూడా తడవలేదని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దశలవారీగా పూర్తి చేస్తామని ప్రకటించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులను పదేళ్లలో పూర్తి చేయలేదని.. 2025 డిసెంబర్ కల్లా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఉత్తమ్ తెలిపారు.

# హుస్సేన్‌సాగర తీరాన నిమజ్జనానికి తొలగిన అడ్డంకులు

మొదటి పేజీ తరువాయి



అనుమతి లేదంటూ ఎక్కడికక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి.. విగ్రహాలను నీళ్లలో వేయడానికి భారీ ఇనుప జాలీలు పెట్టిన అధికారగణం ఎట్టకేలకు దిగొచ్చింది.

అంతేనా.. ట్యాంక్‌బండ్ పైనుంచి నిమజ్జనం కోసం యుద్ధప్రాతిపదికన క్రేన్లు ఏర్పాటు చేస్తున్నారు. మహా నిమజ్జనం సమీపిస్తున్న వేళ భక్తులకు కేక పుట్టించే పరిణామమిది. ఇదంతా గణేశ్ ఉత్సవ సమితి పోరాటం, హెచ్చరికల ఫలితమే!! ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఏడు క్రేన్లు అమర్చారు. సోమవారం మరో ఎనిమిది క్రేన్లు ఏర్పాటు చేస్తారు. ఇక.. ఎన్‌టీఆర్ మార్గ్‌లో తొమ్మిది, పీపుల్స్ ప్లాజా వద్ద ఏడు, జలవిహార్ సమీపంలో రెండు, సాగర్‌లోని బేబీ పాండ్ వద్ద మరో రెండు క్రేన్లు ఉన్నాయి. మొత్తంగా హుస్సేన్‌సాగర్ చుట్టూ వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం 31 క్రేన్లు అందుబాటులో తేనున్నారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

ట్యాంక్‌బండ్ పై నుంచి నిమజ్జనం చేయడానికి వీల్లేదంటూ ఈసారి కూడా జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ విభాగాల అధికారులు హడావుడి చేశారు. అయితే ఎన్‌టీఆర్ మార్గ్ నుంచి నిమజ్జనం కోసం పరిమిత స్థాయిలో క్రేన్లు అమర్చారు. మంగళవారమే మహా నిమజ్జనోత్సవం కావడం.. ట్యాంక్‌బండ్‌పై ఆంక్షలు విధించడంతో ఎప్పటిలాగే గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు కదిలారు. ఆదివారం ఉదయం 9:30కు ట్యాంక్‌బండ్‌పైకి వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, అడ్డుగా పెట్టిన బారికేడ్లు, జాలీలు తొలగించారు. భక్తులను పిలిపించుకొని ట్యాంక్‌బండ్ నుంచి విగ్రహాలను నిమజ్జనం చేయించారు. ఈ క్రమంలో అక్కడ స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. రెండు గంటలపాటు ఆ మార్గంలో ట్రాఫిక్ జాం అయింది.

ఆదివారం మధ్యాహ్నంలోపు నిమజ్జన ఏర్పాట్లు చేయకపోతే గనక సోమవారం నగరవ్యాప్తంగా ఆందోళన చేస్తామని, నిమజ్జనానికి తరలించకుండా ఎక్కడి విగ్రహాలు అక్కడే ఉంచుతామని హెచ్చరించారు. ఏళ్లుగా ట్యాంక్‌బండ్‌పై విగ్రహాల నిమజ్జనం జరుగుతోందని, కొత్త నిబంధనల పేరిట ఇబ్బంది పెట్టాలని చూడటం సబబు కాదన్నారు. 2022, 23లో కూడా ఇలానే చెప్పి.. చివరకు నిమజ్జన ఏర్పాట్లు చేశారని సమితి ప్రతినిధులు గుర్తు చేశారు. సమితి ప్రతినిధులు వెళ్లిన అనంతరం పోలీసులు తిరిగి ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి బారికేడ్లు అడ్డుగా పెట్టారు. విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు వచ్చిన భక్తులు ఇతర మార్గాల వైపు పంపించారు. ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలతో మధ్యాహ్నం నుంచి ఏర్పాట్లు మొదలయ్యాయి. ఫ్లెక్సీలు తొలగించిన అధికారులు.. క్రేన్లు అమర్చేందుకు అనుమతినిచ్చారు. సాధారణంగా నిమజ్జనానికి మూడు, నాలుగు రోజుల ముందే సాగర తీరంలో క్రేన్ల ఏర్పాటు మొదలవుతుంది.

# 'బీమాపై జీఎస్టీ'ని సమీక్షించేందుకు మంత్రివర్గ ఉపసంఘం

మొదటి పేజీ తరువాయి

సీఎంలను సభ్యులుగా నియమించింది. అక్టోబరు 30లోగా తుది నివేదికనివ్వాలని ఈ కమిటీని ఆదేశించింది. ఈ నెల 9న జరిగిన 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాలు జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియాలపై జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశాయి. మరికొన్ని రాష్ట్రాలు జీఎస్టీని 5శాతానికి తగ్గించాలని కోరాయి. ఈ నేపథ్యంలోనే మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ కోవలోని బీమా ప్రీమియాలపై 18% జీఎస్టీ ఉంది. కమిటీ.. ఆరోగ్య బీమాపై వ్యక్తిగత, గ్రూప్, కుటుంబ కేటగిరీల వారీగా.. జీవిత బీమా విషయంలోనూ టర్మ్, లైఫ్ ఇన్సూరెన్స్ కేటగిరీల వారీగా.. అధ్యయనం చేయనుంది. ఆ తర్వాత ఎంతమేర జీఎస్టీ నిర్ణయించాలనే అంశంపై సూచనలతో నివేదిక సమర్పించనుంది.

# రేవంత్ పదవిలో ఉండేది ఐదేళ్లే

మొదటి పేజీ తరువాయి

బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మా వాళ్లే కౌశిక్ రెడ్డి ఇంటికెళ్లారని ఓ పక్క ముఖ్యమంత్రి, గాంధీకి తమకు సంబంధం లేదని, ఇద్దరు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల గొడవని మంత్రి శ్రీధర్‌బాబు మరోపక్క అనడం చూస్తుంటే విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

వర్షాల వల్ల వచ్చిన బురదకు తోడు ముఖ్యమంత్రి అసత్యాల వరదతోనూ రాష్ట్ర ప్రజలు తిప్పలు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నామని, ప్రభుత్వాన్ని నడిపిస్తున్నామనే ఇంగితం లేకుండా రేవంత్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. రేవంత్ పదే పదే తన ఎత్తు గురించి దుర్భాషలాడుతున్నారని వాపోయిన హరీశ్.. తెలంగాణ ఉద్యమం తనని మరింత ఎత్తుకు చేర్చిందని చెప్పారు. ఆత్మనూన్యత భావం వల్లే రేవంత్ ఎత్తు అంశాన్ని ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. తాను తాటిచెట్టంత ఎదిగినా రేవంత్ వెంపలి చెట్టంత కూడా ఎదగలేదని వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ మర్యాద ఇచ్చామని, ముఖ్యమంత్రిని సన్నాసి, లిల్లీపుట్ అని తాము అనలేమా అని ప్రశ్నించారు.

హరీశ్ రావు ఎక్కడ దాక్కున్నాడని సీఎం ప్రశ్నించారని తాను రేవంత్ గుండెల్లోనే నిద్రపోయానని ఎద్దేవా చేశారు. అదృష్టం కొద్దీ సీఎం అయిన రేవంత్ ఆ పదవిలో ఉండేది ఐదేళ్లేనని, కాంగ్రెస్ ఏ రాష్ట్రంలోనూ ఐదేళ్లకు మించి అధికారంలో లేదన్నారు. గాంధీభవన్‌లో సీఎం చెప్పినవన్నీ అబద్ధాలేనని, రుణ మాఫీ అమలు కాలేదనేందుకు ఆధారాలున్నాయని చెప్పారు. సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లిలో రైతులందరికీ రుణమాఫీ జరిగిందా? అనే అంశంపై చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. వానాకాలం రైతు భరోసా ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ఇక, ఫార్మాసిటీ కోసం రూ.1,500 కోట్లు ఖర్చు పెట్టి గత ప్రభుత్వం 12 వేల ఎకరాలు సేకరిస్తే.. సీఎం రేవంత్ అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

# విమోచన దినోత్సవమే జరపాలి

మొదటి పేజీ తరువాయి

ప్రజాపాలన దినోత్సవానికి కేంద్ర మంత్రుల ను ఆహ్వానించిన నేపథ్యంలో కిషన్‌రెడ్డి స్పందిస్తూ.. ముఖ్యమంత్రికి ఆదివారం లేఖ రాశారు. సెప్టెంబర్ 17ను పవిత్రమైన, స్ఫూర్తిదాయకమైన రోజు గా కిషన్‌రెడ్డి అభివర్ణించారు. వేలాది మంది త్యాగాల ఫలితమైన విమోచన దినోత్సవం పేరును మార్చి చరిత్రలో ఏమీ జరగలేదన్నట్టుగా వక్రీకరించడం తగదని పేర్కొన్నారు. ఘనమైన తెలంగాణ చరిత్రను ప్రజల స్మృతిపథం నుంచి తుడిచివేసేందుకు జరుగుతున్న ప్రయత్నంలో తాను భాగస్వామిని కాలేనని తెలిపారు.


**ఓవైసీకి భయపడే.. : మహేశ్వర్‌రెడ్డి**

ఎంఐఎం ఒవైసీలకు భయపడే రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా నిర్వహించడంలేదని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఇతర పేర్లతో నిర్వహించడం తెలంగాణ సాయుధ పోరాట యోధుల త్యాగాలను విస్మరించడమేనని ఆదివారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.

# విరిగిన చేయితో బరిలో దిగి..

## సెంటీ మీటర్ తేడాతో.. టైటిల్ మిస్సయిన నీరజ్ చోప్రా

### డైమండ్ లీగ్ ఫైనల్లో రన్నరప్‌తో సరి



బ్రస్సెల్స్: గత టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణంతో చరిత్రకెక్కి, ఈ ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకంతో డబుల్ ధమాకా సృష్టించిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ ఫైనల్లోనూ తనదైన ప్రదర్శనతో మెరిపించి ఈ సీజన్‌ను బాగానే ముగించాడు. శనివారం అర్ధరాత్రి ఇక్కడ జరిగిన లీగ్ సీజన్ ఫైనల్లో నీరజ్ రన్నరప్‌గా నిలిచాడు. 2022లో తొలిసారి డైమండ్ లీగ్ విజేతగా నిలిచిన నీరజ్.. ఈమారు కేవలం సెంటీమీటర్ తేడాతో టైటిల్ మిస్సయ్యాడు. ఈ బల్లెం వీరుడు మూడో ప్రయత్నంలో ఈటెను 87.86 మీటర్లు త్రో చేసి వరుసగా రెండో ఏడాది రెండోస్థానంలో నిలిచాడు. గ్రెనెడాకు చెందిన రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ 87.87 మీటర్లు త్రో చేసి టైటిల్ విజేతగా నిలిచాడు. జర్మనీ త్రోయర్ జులియన్ వెబర్ 85.97 మీటర్ల త్రోతో మూడోస్థానంలో నిలిచాడు. పీటర్స్ తొలి ప్రయత్నంలోనే ఈటెను అత్యధిక దూరం విసరగా.. ఆ తర్వాత ఎవరూ అతడిని అందుకోలేకపోయారు. కాగా, కొద్దిలో విజయాన్ని దూరం చేసుకున్న నీరజ్ ఈ పోటీలకు గాయంతోనే బరిలోకి దిగడం గమనార్హం. ఫ్రాక్చర్ (విరిగిన) చేతితోనే ఫైనల్లో పోటీపడ్డ నీరజ్, నొప్పిని భరిస్తూనే ఈటెను విసిరాడు. గాయం విషయాన్ని అతడు పోటీలు ముగిశాక వెల్లడించాడు. విరిగిన తన ఎడమ చేతి ఎక్స్‌రే ఫొటోను కూడా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.



‘ఈ టోర్నీకోసం ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు చేతి గాయానికి గురయ్యా. ఎక్స్‌రే తీయిస్తే, ఎడమ చేతి నాలుగో వేలి దగ్గర ఎముక విరిగినట్టు బయటపడింది. అయినా, నా టీమ్ సహాయంతో బ్రస్సెల్స్‌లో పోటీపడ్డా. ఈ ఏడాదికి ఇదే నా చివరి పోటీ. నా అంచనాలను అందుకోలేకపోయినా, ఈ సీజన్‌లో ఎన్నో పాఠాలు నేర్చుకున్నా. మరింత పట్టుదలగా పోరాడతా, పూర్తి ఫిట్‌గా మీ ముందుకొస్తా. మళ్లీ 2025లో కలుద్దాం’ అని 26 ఏళ్ల నీరజ్ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. నీరజ్.. సాధారణంగా కుడిచేతితో ఈటెను విసిరిన వెంటనే ఫాలోత్రూ యాక్షన్‌లో తన ఎడమ అరచేతిని బలంగా నేలపై ఉంచుతాడు. కానీ, ఈసారి పోటీలకు ఎడమ అరచేతికి కట్టుతో దర్శనమిచ్చిన నీరజ్.. భరించరాని నొప్పి కారణంగా తన ఆరు ప్రయత్నాల్లోనూ అరచేతిని నేలపై ఉంచలేదు.

# చిత్తుగా ఓడిన ఇండియా ‘డి’

## ఇండియా ‘ఎ’దే విజయం



ఇండియా ‘డి’ బ్యాటర్ రికీ భుయ్ (113) శతకం బాదినా తమ జట్టు ఓటమిని అడ్డుకోలేకపోయాడు. మిగతా బ్యాటర్ల నుంచి అతడికి పెద్దగా సహకారం అందలేదు. దీంతో దులీప్ ట్రోఫీలో భాగంగా ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో ఇండియా ‘ఎ’ 186 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో ఇండియా ‘ఎ’ 6 పాయింట్లతో టైటిల్ రేసులో ఉండగా, వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిన ఇండియా ‘డి’ పోటీ నుంచి వైదొలిగింది. 488 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా ‘డి’ 301 పరుగుల వద్ద ఆలౌటైంది. తనుష్ కోటియన్‌కు నాలుగు, ములానికి మూడు వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా ‘ఎ’ 290, ఇండియా ‘డి’ 183 పరుగులు చేయగా రెండో ఇన్నింగ్స్‌లో ఇండియా ‘ఎ’ 380/3 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది.

**అన్షుల్‌కు 8 వికెట్లు..:** ఇండియా ‘సి‘ యువ పేసర్ అన్షుల్ కాంబోజ్ ఎనిమిది వికెట్లతో చెలరేగాడు. దీంతో ఇండియా ‘బి’ రెండో ఇన్నింగ్స్‌లో 332 పరుగులకు ఆలౌటైంది. అభిమన్యు ఈశ్వరన్ (157 నాటౌట్) అజేయ శతకంతో నిలిచాడు. ఆ తర్వాత ఇండియా ‘సి’ రెండో ఇన్నింగ్స్‌లో 128/4 వద్ద డిక్లేర్ చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (62), రజత్ పటీదార్ (42) రాణించారు. అయితే చివరి సెషన్ ఆట ఉన్నప్పటికీ మ్యాచ్‌లో ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్లు డ్రాకు అంగీకరించాయి. తొలి ఇన్నింగ్స్‌లో 525 పరుగులు చేసిన ఇండియా ‘సి’కి 193 పరుగుల ఆధిక్యం లభించింది. దీంతో మూడు పాయింట్లు దక్కించుకున్న ఈ జట్టు ప్రస్తుతం టేబుల్ టాపర్ (9)గా ఉంది.

# హాట్ ఫేవరెట్ భారత్

## కొరియాతో సెమీస్ పోరు నేడు... ఆసియా చాంపియన్స్ హాకీ

హులున్‌బుయిర్ (చైనా): ఆసియా చాంపియన్స్ ట్రోఫీ లీగ్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి, ఊపులో ఉన్న భారత హాకీ జట్టు సెమీఫైనల్లో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. సోమవారం కొరియాతో డిఫెండింగ్ చాంపియన్ భారత్ అమీతుమీ తేల్చుకోనుంది. లీగ్ మ్యాచ్‌ల్లో కొరియాతో సహా ఆతిథ్య చైనా, జపాన్, మలేసియా, పాకిస్థాన్‌ను భారత్ ఓడించి, సత్తా చాటింది. ఫార్వర్డ్‌లైన్, మిడ్‌ఫీల్డ్, డిఫెన్స్‌తో సహా అన్ని విభాగాల్లోనూ అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోండడంతో భారత్‌పై అంచనాలు పెరిగాయి. యువ స్ట్రయికర్లు సుఖ్‌జీత్ సింగ్, అభిషేక్, ఉత్తమ్ సింగ్, గుర్జోత్ సింగ్ మంచి ఫామ్‌లో ఉండగా మన్‌ప్రీత్ సింగ్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కూడా స్థాయికి తగినట్టుగా ఆడుతుండడం భారత్‌ను బలీయంగా తయారు చేసింది.
ప్రత్యర్థి కొరియా లీగ్ దశలో టీమిండియా చేతిలో ఓడినా నాకౌట్ పోటీల్లో అంచనాలను తలకిందులు చేయగల సత్తా ఆ జట్టుకు ఉండడంతో సెమీస్ పోరు రసవత్తరంగా సాగే అవకాశముంది. కాగా, సోమవారమే జరిగే మరో సెమీఫైనల్లో పాకిస్థాన్‌తో చైనా తలపడనుంది.






## కృతి శెట్టి.. ఎలా చేసినా లక్కు రాదే..

‘ఉప్పెన’ సినిమాతో టాలీవుడ్ లోకి హీరోయిన్ గా అడుగుపెట్టిన అందాల భామ కృతి శెట్టి. మొదటి చిత్రంతోనే సూపర్ సక్సెస్ అందుకున్న కృతిశెట్టి తరువాత వరుసగా అవకాశాలు అందుకుంది. నానికి జోడీగా ‘శ్యామ్ సింగరాయ్’ చిత్రంలో నటించింది. ఆ మూవీ సక్సెస్ అయ్యింది. ‘బంగార్రాజు’ చిత్రంలో నాగ చైతన్యతో జతకట్టి హిట్ సొంతం చేసుకుంది. హ్యాట్రిక్ హిట్స్ తో కృతి శెట్టి టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ రేస్ లోకి వచ్చింది. తరువాత వరుసగా బ్యాక్ టూ బ్యాక్ మూవీస్ చేసింది. అలాగే కెరీర్ మొదలు పెట్టి రెండేళ్ళు కాకముందే కోటి రూపాయలుకు రెమ్యునరేషన్ డిమాండ్ చేసింది. అయితే ‘బంగార్రాజు’ తర్వాత కృతిశెట్టి చేసిన ఏ మూవీ కూడా హిట్ కాలేదు. దీంతో తెలుగులో క్రమంగా అవకాశాలు కూడా తగ్గిపోయాయి. రెమ్యునరేషన్ కూడా తగ్గించాల్సి వచ్చింది. ఆమె చివరిగా ఈ ఏడాది ‘మనమే’ సినిమాలో శర్వానంద్ కి జోడీగా నటించింది. ఈ సినిమాతో తెలుగులో బ్రేక్ వస్తుందని కృతిశెట్టి ఆశపడింది. అయితే ఈ సినిమా కూడా కమర్షియల్ ఫెయిల్యూర్ గా మారింది. దీంతో కృతిశెట్టి మీద టాలీవుడ్ లో ఐరన్ లెగ్ ఇమేజ్ పడిపోయిందనే మాట వినిపిస్తోంది. ప్రస్తుతం అయితే ఈ బ్యూటీ చేతిలో ఒక్క తెలుగు సినిమా కూడా లేదు. మలయాళంలో టోవినో థామస్ కి జోడీగా చేసిన ‘అజాయంతే రందం మోషణం’ మూవీలో కృతిశెట్టి నటించింది. ఈ సినిమా మలయాళీలో పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. పాన్ ఇండియా రేంజ్ లో ఈ సినిమాని రిలీజ్ చేశారు. అయితే తెలుగు నేటివిటీకి ఈ మూవీ కథ సింక్ కాలేదు. దీంతో తెలుగులో ఆశించిన స్థాయిలో ఆదరణ రాలేదు. ఈ మూవీ తెలుగులో సక్సెస్ అయితే మరల అవకాశాలు వస్తాయని కృతి శెట్టి భావించిన నిరాశే ఎదురైంది.



## బెబో మోనాలిసా అవతారం

బెబో కరీనా మోనాలిసా అవతారం టాక్ ఆఫ్ ది టౌన్ గా మారింది! కరీనా నెవ్వర్ బిఫోర్ లుక్..! ఇప్పుడు ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. దీనికి మైండ్ బ్లోయింగ్ బెబో! అంటూ కుర్రకారు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. అనితా ష్రాఫ్ అదజానియా రూపొందించిన ప్రత్యేకమైన డిజైనర్ షో ఇది. బెబో కరీనా వంద శాతం ఈ షోకి న్యాయం చేసింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. స్టైల్ ఐకాన్ గా, జీరో సైజ్ బ్యూటీగా తనకు ఉన్న ఇమేజ్ ని మరోసారి కరీనా అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. ఎంపిక చేసిన యూనిక్ డిజైన్.. మేకప్ సెన్స్ .. ఫోజ్ ఇలా అన్ని కోణాల్లో ఈ ఫోటోషూట్ ని విశ్లేషిస్తున్నారు. కరీనా షేడ్స్ ఆఫ్ న్యూలి పేరుతో దీనిని అడజానియా తన సోషల్ మీడియాల్లో షేర్ చేయగా అది వైరల్ గా మారుతోంది.



## మల్లిక నుంచి నేర్చుకుంటున్న త్రిప్తి

యానిమల్ చిత్రంతో కొందరి దశ దిశ మారిపోయాయి. ముఖ్యంగా ఈ చిత్రంలో విలన్ గా నటించిన బాబి డియోల్, అతిథిగా నటించిన త్రిప్తి దిమ్రీ ఇద్దరికీ గొప్ప అవకాశాలు వచ్చాయి. వారు స్టార్లుగా ఎదుగుతున్నారు. త్రిప్తి దిమ్రీ వరుసగా భారీ క్రేజీ సీక్వెల్ సినిమాలకు సంతకాలు చేసింది. బాబి డియోల్ దక్షిణాదిన అగ్ర హీరోల సినిమాల్లో విలన్ గా వెలిగిపోతున్నాడు. త్రిప్తి దిమ్రీ తన అందం రూపానికి తగ్గట్టు స్పైసీ కథాంశాలు ఉన్న సినిమాల్లో నటిస్తూ ఆర్జిస్తోంది. ఇటీవలే బ్యాడ్ న్యూజ్ అనే చిత్రంలో తనదైన అందం నటనతో ఆకర్షించింది. ఈ సినిమా యావరేజ్ గా నిలిచింది. కానీ త్రిప్తి అందచందాలు య-ువతరాన్ని మత్తెక్కించాయి. తాజా చిత్రం %-%విక్కీ విద్యా కా వో వాలా వీడియో%-% విడుదల కోసం ఎదురుచూస్తోంది. ఈ చిత్రంలో త్రిప్తి డిమ్రీ రెట్రో అనుభూతిని ఆస్వాధిస్తోందిట. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో రెట్రో లుక్‌ను రివీల్ చేసింది. విక్కీ విద్యా కా వో వాలా వీడియో- ట్రైలర్ లాంచ్ లో ఫ్లోరల్ ఫెర్న్-కలర్ చీరను ధరించి కనిపించింది. 60 ఏళ్ల వయసులో ఉండే 30 ఏళ్ల యువతిగా కనిపించబోతోందా? అన్నది ఆసక్తిని కలిగించింది.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక



## లోక కళ్యాణార్థం.. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు దంపతుల హోమం

మంథని-జనత న్యూస్ : లోక కళ్యాణార్థం హోమం నిర్వహించారు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, శ్కైలజ రామయ్యార్ దంపతులు. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని రావుల చెరువుకట్ట వద్ద గజానన సంస్థ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వారు ప్రత్యేక పూజలు చేశారు. యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలు గణనాథుని

మిగతా 2 లో

# నేడు గణ నాథుల నిమజ్జన వేడుకలు

## కరీంనగర్‌లో భారీ ఏర్పాట్లు

- మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంట కెనాల్..
- మూడు ప్రాంతాల్లో క్రేన్స్, లైటింగ్స్, బారీకేట్లు
- టవర్ సర్కిల్ వద్ద ప్రత్యేక పూజలు
- జిల్లా వ్యాప్తంగా 2931 ప్రతిమలకు జీయో ట్యాగింగ్
- సీపీ అభిషేక్ మహంతి ఆధ్వర్యంలో బందోబస్తు



కరీంనగర్-జనత న్యూస్
తొమ్మిది రాత్రులు పూజలందుకున్న ఘన నాథుడు నేడు నిమజ్జనం కానున్నాడు. అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే శోభాయాత్ర, నిమజ్జన వేడులకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో సమారు మూడు వేల వరకు ప్రతిమలు ఏర్పాటు చేయగా..2931 గణ నాథుల విగ్రహాలకు జీయో ట్యాగింగ్ చేశారు. ప్రధానంగా నగరంలోని 513 గణ నాథుల్లో 8 అడుగులకు పైగా

మిగతా 2 లో





## శాంతి భద్రతలకు భంగం కల్గిస్తే.. ఏ పార్టీవారినైనా వదలం!

పరిపాలన కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య

17, 18 లలో రాజకీయ విద్వేష ప్రకటనలొద్దు

ప్రతిపక్షాలకు రాష్ట్ర మంత్రి పొన్నం వినతి

.. వివరాలు 2లో



## ప్రశాంత వాతావరణలో నిమజ్జన వేడుకలు

శోభాయాత్రకు అన్ని ఏర్పాట్లు చేయాలి

అధికారులకు రాష్ట్ర మంత్రి పొనం ప్రభాకర్ సూచనలు

ఎమ్మెల్యే, కలెక్టర్‌తో కలసి మానకొండూర్ చెరువు వద్ద పరిశీలన

.. వివరాలు 2లో



### తెలంగాణ ప్రజా పాలన కాదు..

## తెలంగాణ ప్రజా వంచన దినోత్సవం జరుపుకోండి

తెలంగాణ విమోచనం నిర్వహిస్తే భాగస్వాములమౌతాం

కాంగ్రెస్ దుర్మార్గాలకు పరాకాష్ట : కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్ : ఈ నెల 17న తెలంగాణ ప్రజా వంచన దినోత్సవం జరుపుకోండని ఎద్దేవ చేశారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్. తెలంగాణ విమోచన వారోత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో

మిగతా 2 లో





## వినాయక నిమజ్జనంలో యువత అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

గణనాథులను దర్శించుకున్న మంత్రి

ఖమ్మం-జనత న్యూస్ : వినాయక నిమజ్జనం సమయంలో యువత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార %-%పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలో పలు ప్రాంతాలో గణనాథుల మండపాలను ఆయన దర్శించుకొని పూజలు చేశారు. మంత్రి ఖమ్మం నగరపాలక సంస్థ పరిధి గొల్లగూడెం రోడ్ లోని సత్యసాయి నగర్, శ్రీనివాస్ నగర్, ముస్తఫా నగర్, విద్యా నగర్, టి.డి.పి. కార్యాలయం రోడ్, వి.డి.ఓస్ కాలని, ఎఫ్.సి. ఐ. గోడౌన్, ఖమ్మం

మిగతా 2 లో



## నేడు ఎల్ఎండీ గేట్ల ఎత్తివేత

కరీంనగర్-జనత న్యూస్ : సోమవారం కరీంనగర్ ఎల్ఎండీ రిజర్వాయర్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలనున్నారు అధికారులు. ఈ విషయాన్ని ఏఈ నాగభూషన్ రావు ఆదివారం ప్రకటించారు. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24 టీఎంసీలు కాగా..ప్రస్తుతం పూర్తి స్థాయిలో నిండిరది. దీంతో సోమవారం ఉదయం 9 గంటలకు లోయర్ మానేరు డ్యామ్ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి సుమారు 5000 క్యూసెక్కుల నీటిని మానేరు

మిగతా 2 లో



## వేగిరంగా కాలువను పునరుద్ధరించాలి

24 గంటల పాటు పనులు జరగాలి

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మం-జనత న్యూస్ : పాలేరు ఎడమ కాల్వ గండి పూడిక పునరుద్ధరణ పనులలో వేగం పెంచాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం హట్యాతండా వద్ద పాలేరు ఎడమ కాల్వ గండి ప్రదేశంలో జరుగుతున్న పునరుద్ధరణ పనుల తీరును ఆయన పరిశీలించారు. పాలేరు ఎడమ కాల్వ గండి పూడిక తీత

మిగతా 2 లో

# నేడు గణ నాథుల నిమజ్జన వేడుకలు

మొదటి పేజీ తరువాయి

ఉన్న 418 విగ్రహాలకు మానకొండూర్, కొత్తపల్లి చెరువులతో పాటు చింతకుంట కెనాల్‌లో నిమజ్జనం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశారు అధికారులు. సోమవారం ఏడు గంటల నుండిన నిమజ్జనం ప్రారంభమై తెల్లవారు వరకు నిర్వహించే అవకాశాలున్నాయి.

కరీంనగర్ జిల్లాలో సోమవారం నిర్వహించే గణేశ్ నిమజ్జన వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేయనున్నారు. నగరంలోని ఆయా డివిజన్లలో సుమారు ఆరు వందల వకు విగ్రహాలుండగా..ఇందులో 513 ప్రతిమలకు పోలీసులు జీయో ట్యాగింగ్ చేశారు. ఇందులో ఎక్కువ శాతం గణేశ్ ప్రతిమలు మానకొండూర్ చెరువులో నిమజ్జనం చేయనున్నారు. ఇక్కడ మూడు భారీ క్రేన్లు ఏర్పాటు చేశారు. కొత్తపల్లి, చింతకుంట కెనాల్ ప్రాంతాల్లోనూ క్రేన్లతో పాటు గజ ఈతగాళ్లు, పోలీసు బందోబస్తు



ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా సీపీ అభిషేక్ మహంతి ఆధ్వర్యంలో డీసీపీ, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐల పర్యవేక్షణలో పోలీసులు విధులు నిర్వహించనున్నారు. శోభాయాత్రలో ఎక్కడ అవాంచనీయ సంఘటనలు జరగకుండా జీయో ట్యాంగింగ్ ద్వారా నియంత్రించేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు పోలీసులు.

**టవర్ సర్కిల్ వద్ద ప్రత్యేక పూజలు**

గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఆయా ప్రాంతాల నుండి టవర్ సర్కిల్ వరకు శోభాయాత్రగా వచ్చి ప్రత్యేక పూజలు జరుపడం ఆనవాయితీగా వస్తోంది. సాయంత్రం టవర్ సర్కిల్ వద్ద మంత్రి, ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశాక, అక్కడి నుండి వరుస క్రమంలో మానకొండూర్ చెరువు వద్దకు వెళ్తుంటాయి. టవర్ సర్కిల్ వద్ద విశ్వ హిందు పరిషత్, భజరంగ్ దళ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. పార్టీలకు అతీతంగా వేడుకలు నిర్వహించుకుంటారు. తెలంగాణ చౌరస్తా, సుభాష్ నగర్, బొమ్మకల్ చౌరస్తా, తదితర ప్రాంతాల నుండి టవర్ సర్కిల్ వరకు గణేశ్ విగ్రహాలు చేరుకునేలా రోడ్ మ్యాప్‌ను రూపొందించారు అధికారులు.

**డీజేలు, టపాసులు నిషేదం**

వేడుకల్లో టపాసులు పేల్చడం, డీజే సౌండ్స్‌ను నిషేదించింది పోలీసు శాఖ. నిమజ్జన ప్రాంతాలతో పాటు రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు .కమాన్ చౌరస్తా, తెలంగాణ చౌరస్తా, కోర్టు చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమారాల ద్వారా శోభాయాత్రను పర్యవేక్షనున్నారు. నగరంలోని అన్ని చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన మైక్‌ల ద్వారా ట్రాఫిక్ నిబంధనలు, రోడ్‌మ్యాన్‌ను భక్తులకు తెలుపుతారు. నగరంలో ఐదుగురు ఏసీపీలు, 12 మంది ఇన్స్‌పెక్టర్లు, 20 మంది ఎస్ఐలు, సుమారు 600 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు.

## లోక కళ్యాణార్థం.. రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు దంపతుల హోమం



మొదటి పేజీ తరువాయి

ఆశీస్సులతో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ లో చేసిన వ్యాఖ్యలు చూస్తే అర్థం అవుతుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నట్ల ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఇక్కడి ప్రజలందరూ తెలంగాణ వారే నని, వారందరినీ గౌరవిస్తామన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ని అంతర్జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున ముందుకు తీసుకెళ్తామని ,రాజకీయాలకు అతీతంగా ఈ ఇమేజ్ నీ మరింత పెంచడంలో అందరూ పాలుపంచుకోవాలన్నారు. హైదరాబాద్ ప్రతిష్టన కొన్ని ప్రతిపక్షాలు దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతితులు తదితరులు పాల్గొన్నారు

## కార్యకర్తల సమాచారంతో స్పందించి రోడ్డు బాగు చేయించిన ఎమ్మెల్యే



ఇల్లంతకుంట జనతా న్యూస్ గుంతలమయమైన రోడ్డును బాగు చేయాలని కార్యకర్తల సమాచారంతో స్పందించి గుంతలు పూడిపించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ. ఈ మధ్యకాలంలో కురిసిన భారీ వర్షాలతో రోడ్లు గుంతల మాయమై ప్రయాణికులకు జరుగుతున్న అసౌకర్యాన్ని గమనించిన కార్యకర్తలు ఫోన్ ద్వారా ఎమ్మెల్యేకు సమాచారం అందించడంతో వెంటనే స్పందించారు. ముస్కానిపేట-కేశన్నపల్లి గ్రామాల మధ్య శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం దగ్గర ఉన్నటువంటి బ్రిడ్జి రోడ్డు మార్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు పూర్తిస్థాయిలో గుంతల మయం కావడం ఇరు గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు,వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక మండల నాయకులు మానకొండూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి,మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దం హన్మంతరెడ్డి స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ గారి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తక్షణమే స్పందించి చెప్పడంతో వారు వెంటనే ట్రాక్టర్ల సహాయంతో ఆ గుంతలను మొరం పోయించి గుంతలు పూడ్చి వేయడం జరిగినది. స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కవ్వం పల్లి సత్యనారాయణ వెంటనే స్పందించి రోడ్డు బాగు చేయించడంతో స్థానికులు ఇరు గ్రామాల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాట్ల వీరేశం,గుముటాల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎల్ఎండీ గేట్ల ఎత్తివేత

మొదటి పేజీ తరువాయి

నది లోనికి వదుల నున్నట్లు ఆయన తెలిపారు. రెవిన్యూ , పోలీస్ శాఖ అధికారులు తగు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో దండోరా వేయించాల్సిందిగా ఆయన ఆయా శాఖల అధికారులను కోరారు. నదీ పరివాహక ప్రాంతం లోకి పశువులు , గొర్లు వెళ్లకుండా చూసుకోవాలని, చేపలు పట్టేవారు, గొర్రె ల కాపరులు, రైతులు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోయర్ మానేరు జలాశయం దిగువ పరివాహక ప్రాంతాల గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులు, ప్రజప్రతినిధులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## శాంతి భద్రతలకు భంగం కల్గిస్తే.. ఏ పార్టీవారిన్కైనా వదలం!

కరీంనగర్-జనత న్యూస్

శాంతి భద్రతలకు భంగం కల్గిస్తే ఏ పార్టీ నేతన్కైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం రాష్ట్ర మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా బీఆర్ఎస్ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని..హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే ఉపేక్షించేది లేదని, కఠినంగా వ్యవహరించాలని ఇప్పటికే పోలీస్ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. హైదరాబాద్ కలెక్టరేట్ లో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇందుకు సంబంధించిన ఆదేశాలు జారీ చేశామని, 17,18 వ తేది వరకు ఎలాంటి రాజకీయ కార్యక్రమాలు, ప్రకటనలు చేయడానికి వీలు లేదని ప్రతిపక్ష పార్టీల నేతలకు సూచించారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న వారు 10 నెలలోనే అసహనానికి గురై ప్రభుత్వంపై వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలపై మంత్రి పొన్నం మండి పడ్డారు. పార్టీ ఫిరాయింపుల అంశం హైకోర్టు లో ఉందని, అది శాసన సభ చూసుకుంటుందన్న ఆయన..రాజకీయ విమర్శలు చేసి కొట్లాడుకోవాలనుకుంటే వినాయక నిమజ్జనం తరువాత చూసుకోండని హితవు చెప్పారు. పరిపాలన చేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని మంత్రి పొన్నం వ్యాఖ్యానించారు.

## ప్రశాంత వాతావరణలో నిమజ్జన వేడుకలు



మానకొండూర్-జనత న్యూస్ : ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జన వేడుకలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు వద్ద ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, మున్సిపల్ కమీషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఇతర అధికారులతో కలసి మంత్రి పొన్నం పరిశీలించారు. అనంతరం మానకొండూర్ పంచాయతీ కార్యాలయంలో అధికారులతో కలసి సమావేశమై పలు సూచనలు చేశారు. శోభాయాత్ర సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించాలని, నిమజ్జనం జరిగే ప్రదేశంలో ల్కెటింగ్ ఇతర ఏర్పాట్లు చేయాలని సూచించారు. 16న సోమవారం కరీంనగర్‌లో గణేష్ నిమజ్జన వేడుకలు నిర్వహించాలని, మానకొండూర్, కొత్తపల్లి చెరువు లతో పాటు చింతకుంట కెనాల్ ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గణేశ్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సరఫరా చేసిందని చెప్పారు. అతిథులు , వీఐపీ వస్తె రెవెన్యూ పరంగా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

## వేగిరంగా కాలువను పునరుద్దరించాలి





మొదటి పేజీ తరువాయి

పనుల వివరాలు, తాత్కాలికంగా చేపడుతున్న పనులు, శాశ్వత పునరుద్ధరణ పనులపై అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం రైతులకు సాగునీరు అందించడానికి చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి సూచించారు. గండి పూడిక పనులు 24 గంటల పాటు జరగాలని, అవసరమైన మేర అదనపు యంత్రాలు, షిఫ్టులవారీగా కార్మికులు పనిచేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కాల్వ తవ్వకం, ల్కెనింగ్ పనులు సమాంతరంగా జరగాలని మంత్రి అధికారులకు సూచించారు. మంత్రి వెంట ఇరిగేషన్ సిఇ విద్యాసాగర్, ఎస్ఇ నర్సింగ రావు, సంబంధిత అధికారులు ఉన్నారు.

## వినాయక నిమజ్జనంలో యువత అప్రమత్తంగా ఉండాలి



మొదటి పేజీ తరువాయి

రూరల్ లోని పెద్ద తండ, శ్రీరామ్ నగర్ కాలని -2 లోని గణేష్ మండపాల్లో ప్రతిష్టించిన గణానాథులను దర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు నవరాత్రులుగా వినాయకున్ని భక్తిశ్రద్ధలతో పూజించారని, ఆ వినాయకుడు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు అనేక ఆకాంక్షలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల కోరికలు, ఆశలు నెరవేర్చేలా ఆ వినాయకుడు ప్రభుత్వానికి అవసరమైన శక్తి సామర్థ్యాలు అందించాలని ప్రార్థిస్తున్నట్లు మంత్రి తెలిపారు. వినాయక నిమజ్జనాన్ని అందరు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా యువత అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాలను నివారించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల నరేందర్, రాపర్తి శరత్, దొడ్డా నగేష్, నాయకులు తుళ్ళూరు బ్రహ్మయ్య, కొప్పుల చంద్ర శేఖర్, షేక్ మియా భాయ్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజా పాలన కాదు.. తెలంగాణ ప్రజా వంచన దినోత్సవం జరుపుకోండి

మొదటి పేజీ తరువాయి

ఎగ్జిబిషన్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ తోపాటు పలువురు నేతలతో కలిసి సంజయ్ తిలకించారు. అనంతరం వారితో కలిసి మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 17న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్వవం ఎందుకు నిర్వహించడం లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. 'తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం' పేరుతో ఆ పార్టీ తెలంగాణ ప్రజలను వంచిస్తోందన్నారు. 50 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస పార్టీ ప్రజలను వంచించినందున 'తెలంగాణ ప్రజా వంచన దినోత్సవాన్ని' నిర్వహించుకోవాలని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను రాచిరంపాన పెట్టిన రజకార్ల పార్టీ వారసులకు కాంగ్రెస్ వత్తాసు పలకడం సిగ్గు చేటన్నారు.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహించాలని మాట ఇచ్చిన తరువాత వరుసగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మోదీ ఆదేశాలు, అమిత్ షా సూచనల మేరకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ భాగమై ఈ ఉత్సవాలు నిర్వహిస్తోందన్నారు. తెలంగాణ విమోచన కోసం జరిగిన పోరాటాల చరిత్రను 75 ఏళ్లపాటు తొక్కిపెట్టేందుకు ప్రయత్నించారని, ఎన్నో ఏళ్లపాటు తెలంగాణ విమోచన దినోత్సవం జరపాలని యువకులు జాతీయ జెండాలు పట్టుకుని ఉద్యమించారన్నారు.

నిజాం నిరంకుశ పాలనపై కొమరం భీం, చాకలి ఐలమ్మ, స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామక్రిష్ణారావు, కొండా లక్ష్మణ్ బాపూజీ పోరాటాలు.. హిందూ మహాసభ, ఆర్య సమాజ్ పోరాటాలను గుర్తుచేసేందుకు, రాబోయే తరాలకు ఈ చరిత్రను అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ విమోచన దినోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన 1500 మందిని బలిదానం చేసుకున్న పార్టీ కాంగ్రెస్ అని, వారి బలిదానాలతో తీవ్ర భావోగ్వేదానికి గురైన సుష్మాస్వరాజ్ ఎవ్వరూ చనిపోవద్దని పేర్కొంటూ తెలంగాణ బిల్లును పార్లమెంట్ లో ఆమోదింపజేసి స్వరాష్ట్ర ఏర్పాటుకు క్రుషి చేశారని గుర్తు చేశారు. ఒకవైపు రాహుల్ గాంధీ అమెరికాలో భారతదేశాన్ని కించపరుస్తున్నడని, ఇక్కడ ఒవైసీకి వత్తాసు పలికి తెలంగాణను సీఎం కించపరు-స్తున్నడని ఆరోపించారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో యువకులతో క్రికెట్ ఆడి ఉత్సాహ పర్చారు.

## ప్రతి ఇంటిలో బిజెపి కార్యకర్త ఉండాలి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి**



చిగురుమామిడి జనత న్యూస్: ప్రతి ఇంటిలో బిజెపి కార్యకర్త ఉండేలా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలో గ్రామ గ్రామాన బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతున్న సందర్భంగా ఆదివారం బొమ్మనపల్లి గ్రామంలో కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి సభ్యత్వ నమోదు తీరును పరిశీలించారు. గ్రామంలో గడపగడపకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను, చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించి బిజెపి సభ్యత్వం తీసుకునేలా కృషి చేయాలని బూతు అధ్యక్షులు, స్థానిక నాయకులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు పైడిపెల్లి శ్రీనివాస్ గౌడ్,సభ్యత్వ కన్వీనర్ అచ్చ రవీందర్,కో కన్వీనర్ కంది శంకర్,బూత్ అధ్యక్షులు నిమ్మ రమాకాంత్ రెడ్డి,ఆరేళ్ల శ్రీనివాస్,మామిడి రమేష్ మాచమల్ల బుజన్న,నరేందర్ రెడ్డి,దరిపల్లి రమేష్ సుకోషి వేణు రంజిత్ శశి అరుణ్ ఆంజనేయులు మామిడి రమేష్ పసుల రాకేష్ చట్ల నాగరాజు ఓర్సు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీగా గెలిపిస్తే.. పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తా

**వాకర్స్‌ను కలిసిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి**



కరీంనగర్-జనత న్యూస్ : ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి. కరీంనగర్ లోని డాక్టర్ అంబేద్కర్ స్టేడియంలో వాకర్స్‌ను ఆయన కలిసి మద్దతు కోరారు. కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని, ఈ సారి తనకు అవకాశం కల్పించాలని యువకులను కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో పట్టభద్రుల పాత్ర ఎనలేనిదని గుర్తు చేశారు. నిరుద్యోగులకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించేలా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే అల్ఫోర్స్ విద్యా సంస్థల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చి దిద్దుతున్నానని తెలిపారు. 2025 సంవత్సరంలో నిర్వహించే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కాగా..విద్యరంగ అభివృద్ధికి కృషి చేస్తూన్న నరేందర్ రెడ్డిని పలు వాకర్స్ అసోసియేషన్లు ఘనంగా సన్మానించాయి.

## ఆధ్యాత్మిక వేడుకల్లో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



కరీంనగర్-జనత న్యూస్ : ఆధ్యాత్మిక వేడుకల్లో పాల్గొన్నారు అల్ఫోర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి. నగరంలోని గణేశ్ నగర్, విద్యానగర్, సూర్యానగర్ ప్రాంతాల్లోని గణేశ్ మండపాల్లో పాల్గొని పూజలు చేశారు. అనంతరం పల్లకి సేవలో ఆయన పాల్గొన్నారు. విఘ్నాలకు అధిపతి గణనాధుడని, ఆ గణేశున్ని ఆరాధించినవారికి ఎన్నో లాభాలుంటాయని తెలిపారు. గణపతి నవరాత్రులు అనగానే సంతోషం, బంధుత్వం, అప్యాయత, సోదరభావం, ఆనందం వెల్లివిరుస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరు ప్రథమ పూజ్యుని సేవలో తరించి అత్యుత్తమ జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. స్వామి వారి విశిష్టత వర్ణింపలేనిదని తెలుపుతూ, ప్రతి నిర్వహకుడు వచ్చే సంవత్సరం నుండ్కైనా మట్టిగణపతులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షులుగా ఉండాలని కోరారు. వచ్చే పట్లభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో విజయం సాధించే దిశగా అడుగులు వేసి నూతన చరిత్ర సృష్టించాలని కోరుకుంటూ మండపాల నిర్వాహకులు నరేందర్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గణపతి మండపాల నిర్వహకులు, కాలనీవాసులు, అల్ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# పీసీసీ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి.. వెలిచాల రాజేందర్ రావు హాజరు



హైదరాబాద్ : హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆదివారం సాయంత్రం అట్టహాసంగా జరిగిన నూతన పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి అభినందించారు. బీసీ బిడ్డకు పీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పదవీ ప్రమాణ స్వీకారం తోపాటు బాధ్యతలు స్వీకరించిన పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు రాజేందర్ రావు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీ సీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తామని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఇంటింటా అవగాహన కల్పిస్తామని రాజేందర్ రావు పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## అలు పెరుగని పోరాట యోధుడు చామనపల్లి

**సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి**



కరీంనగర్-జనత న్యూస్ : అలుపెరగని పోరాట యోధుడు చామనపల్లి చొక్కారావు అని కొనియాడారు సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి. కరీంనగర్ జిల్లా రూరల్ మండలం చామనపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మర్రివెంకటస్వామి చొక్కారావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. మొట్ట మొదటి ఇందుర్తి ఎమ్మెల్యేగా చొక్కారావు సేవలు అందించారని గుర్తు చేశారు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడి వేలాది ఎకరాల భూ పంపిణీలో చొక్కారావు భాగస్వాములయ్యారని కొనియాడారు. పోరాటాలకు సంబంధం లేని బీజేపీ నాయకులు స్వాతంత్ర సమరయోధులు, రైతాంగ పోరాట అమరుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. నేటి కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలపై పోరాటాల ఉధృతం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కరీంనగర్ నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్ , కరీంనగర్ మండల కార్యదర్శి సాయవేణి రాయమల్లు, కౌన్సిల్ సభ్యులు నలువాల సదానందం, బొనగిరి మహేందర్, మండల కౌన్సిల్ సభ్యులు మెరుగు కొమురయ్య, దొమ్మాటి నాంపల్లి, పెరుమళ్ళ శ్రీనివాస్, పెరుమల్ల తిరుపతి, బోగుంట తిరుపతి, బోగొండ వీరేశం, తూగుంటరాజు, గంట అంజయ్య, బ్రాహ్మణ పెల్లి సంపత్, కల్వల అంజయ్య, అశోక్, సిహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నూతన టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ప్రభుత్వ విప్..



వేములవాడ,జనత న్యూస్: హైదరాబాద్ లోని గాంధీ భవన్ యందు నూతన టీపీసీసీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను ఆదివారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొని పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం రాజన్న ప్రసాదం అందచేశారు.

## జిట్టా బాలక్రిష్ణారెడ్డికు యువజన సంఘాల నివాళి



భువనగిరి : యువజన సంఘాల సమితి వ్యవస్థాపకులు, జాతీయ యువజన అవార్డు గ్రహీత, తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలక్రిష్ణారెడ్డికు యువజన సంఘాల ప్రతినిధులు నివాళ్లు అర్పించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి కన్వెన్షన్ హాల్ లో సంస్మరణ, దశదినకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా యువజన సంఘాల సమితి ప్రతినిధులు కిరణ్ కుమార్, రేండ్ల కళింగ శేఖర్, అలువాల విష్ణు, తెలంగాణా ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి రాజేశ్వర్, యువజన సంఘాల సమితి బాధ్యులు గడ్డం జగత్ పాల్, కోట మధు పాల్గొని చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువజన సంఘాల స్థాపన ద్వారా గత 25 సంవత్స రాల నుండి కరీంనగర్ జిల్లాకు ఎంతో అనుబంధంఉన్నదని, జిట్టా బాలక్రిష్ణారెడ్డి ప్రోత్సాహంతో జిల్లా నుండి ఎంతోమంది యువతీ,యువకులు జాతీయ స్థాయిలో రాణించారని గుర్తు చేశారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం ఆయన జీవితాన్ని ధారపోసారని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్రం తో పాటు తెలంగాణలో ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకొని, తన ఆశయ సాధన కోసం యువజన సంఘాలు ముందుకు సాగుతాయని తెలిపారు.

## నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



కరీంనగర్-జనత న్యూస్ : గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం పరిశీలించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్ ను సందర్శించి ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించి మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనానికి రానున్న గణేష్ విగ్రహాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలని అన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను చెరువుల్లో, కాలువల్లో వేయకుండా ఒక ప్రత్యేక స్టోరేజ్ పాయింట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని సూచించారు. నిమజ్జనం పాయింట్లలో అత్యవసర చికిత్స కోసం మెడికల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. సౌండ్స్, లైట్స్, మంచినీటి వసతి, జనరేటర్ ఏర్పాటు వంటివి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, రెవిన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జిల్లా వైద్యాధికారి సుజాత పాల్గొన్నారు.

# శబాష్..కౌశిక్‌రెడ్డి...

## గులాబీ అధినేత కేసీఆర్ కితాబు

## ప్రభుత్వ వ్యతిరేక పోరాటంలో

## కౌశిక్ ను నందించిన కేసీఆర్



హుజురాబాద్ సెప్టెంబర్ 14 జనతా న్యూస్ : ఇటీవల జరిగిన పరిణామాల అనంతరం మాజీ ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ను ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ లో ఆదివారం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్,ఎమ్మెల్యే వివేక్,మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు ఉన్నారు. ఇటీవల హైకోర్టు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలంటూ స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించిన నేపథ్యంలో.. కౌశిక్ రెడ్డి ప్రెస్ మీట్ పెట్టి సంబంధిత ఎమ్మెల్యేలను స్పీకర్ నిర్ణయానికి ముందే హైకోర్టు తీర్పును గౌరవిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం, తదనంతరం శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ తన అనుచరులతో కౌశిక్ రెడ్డి ఇంటికి వచ్చి దాడి చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మాజీ మంత్రులు హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి తదితరులను అరెస్టు చేసి కేశంపేటకు తరలించడం, పెద్ద ఎత్తున గులాబీ శ్రేణులు ఆందోళన చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తదనంతరం అమెరికా నుండి వచ్చిన కేటీఆర్ కౌశిక్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కౌశిక్ రెడ్డి కేటీఆర్ తో కలిసి గులాబీ బాస్ కేసీఆర్ ను కలవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చ నియాంశమైంది.

**పార్టీ అండగా ఉంటుంది..దీటుగా పోరాడు:కేసీఆర్**

ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో తనను కలిసిన కౌశిక్ తో కేసీఆర్ కొద్దిసేపు ముఖ్య విషయాలు మాట్లాడినట్టు తెలుస్తోంది. అధికార పార్టీ వైఫల్యాలను, కుట్రలను ప్రశ్నించే బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేయాలనే ఉద్దేశంతోనే ఉద్దేశపూర్వకంగానే సీఎం,పార్టీ మారిన ఎమ్మెల్యేల ప్రోద్భలంతోనే నీ ఇంటి పై దాడి జరిగింది. ఇలాంటి దాడులకు.. భయపడొద్దు.. ఇలాంటివి ఉద్యమ సమయంలో ఎన్నో చూసాం..అలా భయపడితే తెలంగాణ వచ్చేదా..? అని కేసీఆర్ పేర్కొన్నట్టు తెలిసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసెంబ్లీలో, బయట గట్టిగానే నీ వాయిస్ ను వినిపించాలి.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి.. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా పోరాడాలి.. పార్టీ నీకు ఎల్లవేళలా అండగా ఉంటుందని కేసీఆర్ పేర్కొన్నట్టు తెలిసింది. నిన్ను ఒక సంఘ విద్రోహ శక్తిగా ముద్ర వేసి.. దుష్ప్రచారం చేసి..నిన్ను అదుపు చేయాలని చూస్తున్నారు.. దీని వెనక కాంగ్రెస్ పార్టీ కుట్ర ఉంది.. నువ్వు అన్యాయాలను అక్రమాలను ప్రశ్నించడంతోపాటు.. ప్రభుత్వాన్ని నిలదీయడం కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే నిన్ను టార్గెట్ చేశారు. హైదరాబాద్ ఇమేజ్ ను డామేజ్ చేసి ఆ నెపాన్ని బీఆర్ఎస్ పార్టీ మీద రుద్దే ప్రయత్నం చేస్తున్నారు.ప్రజలకు అన్ని విషయాలు తెలుసు. హైదరాబాద్ ను గత పది ఏళ్లలో ఎంత ప్రశాంతంగా ఉంచామో.. అన్ని రంగాల్లో ఎంత అభివృద్ధి చేశామో.. ప్రపంచానికి తెలుసు..ఇలాంటి జిమ్మిక్కులను ప్రజలు నమ్మబోరు.. హైదరాబాద్ ప్రజలు మనతోనే ఉన్నారని కేసీఆర్ చెప్పినట్టు తెలిసింది.రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సంకట స్థితిలో ఉన్నాయి.. కచ్చితంగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ చర్యలు తీసుకోవాల్సిందే.. ఈ విషయంలో ఇరుకున పడ్డామనే బాధతోనే వాళ్లు నీపై దాడి చేశారు.. అని ఆయన అన్నట్టు తెలిసింది. పాలనలో.. ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైంది. దీని నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకే.. లేనిపోని విషయాలు తెరమీదకి తీసుకువస్తోంది.. ప్రజలు కాంగ్రెస్ నైజాన్ని, మోసాన్ని గమనించారు.. నీకు పార్టీ అండగా ఉంటుంది.. దీటుగా పోరాడు.. అని గులాబీ అధినేత చెప్పినట్టు సమాచారం. ఇలాంటి ఆరోపణలు వస్తుంటాయి పోతుంటాయి.. ఇది ప్రతిపక్షాలకు కుట్ర.. కావాలనే చేస్తున్న దుష్ప్రచారం.. దీన్ని దీటుగా ఎదుర్కోవాలి.. పార్టీ శ్రేణులను ముందుకు తీసుకువెళ్లాలి..బీఅర్ఎస్ పార్టీని లేకుండా చేయాలనే అధికారపక్ష కుట్రలను తీపి కొట్టాలని ఆయన చెప్పినట్టు తెలిసింది. నీ ఇంటిపై దాడి చేస్తే పార్టీ శ్రేణుల నుంచి మంచి స్పందన వచ్చింది.. గులాబీ శ్రేణులు రోడ్లపైకి వచ్చి ధర్నా చేశాయి.. ఎక్కడికక్కడ నాయకులను అరెస్టులు చేశారు.. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలి.. ప్రభుత్వ మోసాలను ఎండగట్టాలి.. యావత్తు పార్టీ శ్రేణులకు అండగా ఉంటాను అని కేసీఆర్ తెలిపినట్టు సమాచారం.



## సొంతగూటికి తిరిగి వచ్చిన మాజీ సర్పంచ్ జయపాల్ రెడ్డి

### చాడ సమక్షంలో సీపీఐ లో చేరిక

### పార్టీ బలోపేతం దిశగా సిపిఐ అడుగులు



చిగురుమామిడి జనత న్యూస్ : మండలంలో ఏర్పడిన రాజకీయ శూన్యతను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి సిపిఐ పార్టీ అడుగులు వేస్తుంది. ఇందులో భాగంగా ఓగులాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కోమటిరెడ్డి జయపాల్ రెడ్డిని సొంతగూటికి తీసుకురావడంలో పార్టీ నాయకత్వం విజయం సాధించింది.ఆదివారం మండలంలోని ఇందుర్తి గ్రామ శివారులోని ముస్కు రాజిరెడ్డి స్మారక స్తూపం వద్ద రాజిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని నివాళులర్పించడానికి ముఖ్య అతిథిగా వచ్చిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి సమక్షంలో జయపాల్ రెడ్డి సిపిఐలో చేరారు. జయపాల్ రెడ్డికి చాడ వెంకటరెడ్డి సిపిఐ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.మండలంలో పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ లు,ఎంపీటీసీలు, జడ్పీటీసీ గెలుపు కోసం తన వంతు కృషి చేస్తానని జయపాల్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, కౌన్సిల్ సభ్యులు ఇల్లందుల రాజయ్య, బూడిద సదాశివ, చిన్నస్వామి ఓగులాపూర్ మాజీ సర్పంచ్ బోయిన మొండయ్య, నాయకులు యాకూబ్ అలీ,ముస్కు శ్రీనివాసరెడ్డి,అంజారెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయంగా దెబ్బ తీసేందుకు కుట్ర



హుజురాబాద్, సెప్టెంబర్ 15 జనతా న్యూస్: నాగార్జున డైరీలో జరుగుతున్న అక్రమాలను బయటికి తీసి పోరాటం చేసిన తనపై ఆ సంస్థ యాజమాన్యం రాజకీయంగా దెబ్బ తీసేందుకు కుట్రచేసిందని టీపీసీసీ ఎస్సీ అట్రాసిటీ విభాగం రాష్ట్ర ఇంచార్జీ తిప్పారపు సంపత్ ఆరోపించారు. ఆదివారం సంపత్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హుజురాబాద్ పరకాల క్రాస్ రోడ్ సమీపంలోని నాగార్జున డైరీలో పాల పొడితో పాలు తయారు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసానని, దీంతో తనపై కుట్ర చేస్తూ తన అనుచరుడు రూ.15 లక్షలు అడిగినట్టు ఒక ఆడియో రికార్డు రిలీజ్ చేసి తనను సామాజికంగా, రాజకీయంగా బద్నామ్ చేసే ప్రయత్నం చేసారని ఆరోపించారు.రూ.15 లక్షలు డిమాండ్ చేసిన విషయమై సమగ్ర విచారణ చేసి సదరు అగంతకుడిని అరెస్టు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసిన పోలీసులు శనివారం మేడారం యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్న పరకాల సమ్మయ్య గౌడ్ ను అరెస్టు చేశారని వెల్లడించారు.రూ.15 లక్షలు అడిగింది నా అనుచరుడు కాదని, తాను డబ్బులు అడగలేదని తనపై పరకాల సమ్మయ్య గౌడ్ తదితరులు కుట్ర చేశారని పోలీసులు విచారణలో నిగ్గు తేల్చారని వెల్లడించారు.గతంలో అప్పటి మంత్రి ఈటల రాజేందర్ ను ప్రశ్నించినందుకు అనేక అక్రమ కేసులు పెట్టి తనను జైల్లో పెట్టారని గుర్తు చేసారు. ప్రస్తుతం కౌశిక్ రెడ్డిని ప్రశ్నించడంతో తనపై మరోసారి కుట్రలు చేస్తున్నారని, ప్రజాస్వామ్యం ఉందా? లేదా? అనే భయంలో దళితులు ఉన్నారన ఆవేదన వ్యక్తం చేశారు.నాగార్జున డైరీ విషయంలో పోలీసులు నిజాలు తేల్చారని కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

తనపై జరిగిన కుట్ర వెనుక ఎంత పెద్ద వ్యక్తులు ఉన్నా వారిపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేసారు. తాను తప్పు చేయలేదని నాగార్జున డైరీ యజమాని డబ్బులు అడగలేదని నమ్మి తనకు మద్దతు గా నిలిచిన దళిత సంఘాలకు,ప్రజాసంఘాలకు,రిటైర్డ్ సీఐ భూమయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇకనుండి తనపై ఎవరు కుట్ర చేసినా సహించేది లేదని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు రుద్రారపు రామచంద్రం, మల్లయ్య, సాయి అరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గన్నేరువరం-జనత న్యూస్ : కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లి లోని కరుణాకర్ దాబా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. బైక్‌ను వెనుక నుండి వచ్చిన కారు ఢ కొట్టడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం వీరాపూర్‌కు చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. ఇందులో బైక్ నడుపుతున్న వ్యక్తికి తలకు, కాలుకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం కరీంనగర్ అసుపత్రికి తరలించారు. కారును అతివేగంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.



## గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు..

### శోభాయాత్ర లో డీజేల వినియోగం,బాణాసంచా నిషేధం : సీపీ అనురాధ

### శాంతియుత వాతావరణంలో శోభయాత్ర నిర్వహించుకోవాలని సూచన



సిద్దిపేట,జనత న్యూస్: సిద్దిపేట జిల్లాలో నేడు,రేపు నిర్వహించుకనే గణేష్ నిమజ్జనానికి పోలీస్ శాఖ పటిష్ట భద్రత ఏర్పాటుచేసిందని..శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిమజ్జనోత్సవం నిర్వహించుకోవాలని ఆదివారం సీపీ అనురాధ సూచించారు.సిద్దిపేట పట్టణం కోమటి చెరువు,ఎర్ర చెరువు,గజ్వేల్ పట్టణం పాండవుల చెరువు,ప్రజ్ఞాపూర్ ఊర చెరువు,దుబ్బాక రామసముద్రం చెరువు,హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు, చేర్యాల కుడి చెరువుల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తుతో పాటు, పోలీసుపరంగా అవసరమైన అన్ని చర్యలు చేపట్టామని సీపీ తెలిపారు.వినాయక శోభయాత్రలో డీజేల వినియోగం,బాణాసంచా కాల్చడంపై నిషేధం విధించామన్నారు.నిమజ్జనం కొరకు నిర్వహించే శోభాయాత్రలో పాల్గొనే భక్తులు దేవునిపై భక్తి శ్రద్ధలు భజన కార్యక్రమాలు నిర్వహించుకుంటూ కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు శోభయాత్ర ప్రదేశాలలో నిమజ్జనంపై సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పరివేక్షణ నిర్వహించనున్నట్టు తెలిపారు.వినాయక మండపాల అన్నిటికీ జియో ట్యాగింగ్ చేశామని జరిగింది. వినాయక శోభయాత్ర ఎక్కడ నుండి ఎక్కడికి వెళుతుంది జీపీఎస్ సిస్టం ద్వారా కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తామని తెలిపారు. జిల్లా ప్రజలు,ప్రజాప్రతినిధులు,యువకులు వినాయక శోభాయాత్రను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. చెరువులు కుంటలు పొంగిపొర్లుతున్నందున చిన్నపిల్లలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్వేషపూరిత నినాదాలు, ప్రసంగాలు చేయడం లేదా పాటల వినియోగం వంటి చర్యలకు పాల్పడరాదని తెలిపారు. నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలంతా భక్తి శ్రద్దలతో, మతసామారస్యాన్ని కాపాడుతూ ప్రశాంత వాతావరణంలో నిమ్మజ్జన కార్యక్రమం నిర్వహించుకోవాలని సూచించారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన..



పెద్దపల్లి,జనత న్యూస్: పెద్దపల్లి పట్టణంలో నేడు తలపెట్టిన వినాయక నిమజ్జనం సందర్భంగా ఎల్లమ్మ,గుండమ్మ చెరువును సందర్శించి నిమర్జన ఏర్పాట్లను ఎమ్మెల్యే విజయరమణ రావు పరిశీలించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిమజ్జన ప్రశాంత వాతావరణంలో జరిగేల చర్యలు తీసుకోవాలని రామగుండం సీ.పీ,పోలీసు యంత్రాంగానికి, మున్సిపల్ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ తొమ్మిది రోజులు ఎంతో నిష్ఠతో పూజించిన గణనాథుని నిమజ్జనం సందర్భంగా నిమర్జన వేడుకలకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేశామని ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని తెలిపారు.చెరువుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి సూచనలు చేశారు. పెద్దపల్లి ప్రజలు అందరూ నిమర్జనానికి సంబంధించిన సిబ్బందికి సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రామగుండం కమిషనర్ సీపీ శ్రీనివాస్,డీసీపీ చేతన, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్,పోలీస్ ఉన్నత అధికారులు,మున్సిపల్ అధికారులు, పెద్దపల్లి పట్టణ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ పేరునా మోసం..

### సభ్యత్వం,మహాసభ,కాన్పరెన్స్ పేరిట రూ.కోట్లలో వసూళ్లు..?

### మోసం చేసిన టంగుటూరి రామకృష్ణ,

### వనపర్తి మల్లికార్జునపై పోలీసులకు పిర్యాదు

### చట్టపరమైన చర్యలుతీసుకోవాలని

### ఏసిపిఎస్ ప్రేమ్ గాంది డిమాండ్

హైదరాబాద్,జనతా న్యూస్: కులం పేరునా మోసాలకు పాల్పడిన వారితో రాష్ట్రంలో ఎక్కడో ఒక ప్రాంతంలో అమాయకులు నిత్యం కులం పేరునా మోసపోతూనే ఉన్నారు.ఈ లాంటి సంఘటన అదిలాబాద్ జిల్లాలో వెలుగుచూసింది.వాట్సప్ గ్రూప్‌లలో వైరలో అవుతున్న ఒక సందేశం పై ఆర్యవైశ్య మహాసభ నిర్వాహకులు పాల్పడిన మోసపూరిత కుట్రపై ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు ప్రేమ్ గాంధీ ఆదివారం అవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన జనతా ప్రతినిధి తో మాట్లాడాతూ గత కొద్దిరోజుల క్రితం మద్రాసుకు చెందిన టంగుటూరి రామకృష్ణ అధ్వర్యంలో ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ అబుదాభిలో నిర్వహిస్తున్నామని వనపర్తి మల్లికార్జున్ పెద్ద ఎత్తున ప్రకటనలు చేశారని ఆరోపణలు వస్తున్నాయని దీనిపైన విచారణ చేపట్టి ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయన్నారు.ప్రపంచ ఆర్య వైశ్య మహాసభకు సభ్యత్వ రుసుం రూ.2500,అబుధాభి మహాసభలు రూ.87000,కాన్పరెన్సుకు రూ.5000 ఆర్య వైశ్యులను నుండి వసూళ్లు చేశారు.మహాసభ పేరునా లోటస్ హాలీడేస్ కాచిగూడ పేరునా నిర్వహాకులు పోన్ ఫే,గుగూల్ ఫే ద్వార రూ.కోట్లలో వసూళ్లు చేశారు.శనివారం ప్రపంచ ఆర్య వైశ్య మహాసభకు తరలివెళ్లాడానికి పలువురు ఆర్య వైశ్యులు శంషాబాద్ అంతర్జాతీయ విమానశ్రయానికి చేరుకున్నారు. నిర్వహాకులు టంగుటూరి రామకృష్ణ,వనపర్తి మల్లికార్జున్ ప్రయాణికులకు వీసాలు అందించకుండా మోసం చేయడంతో వెనుదిరిగారు.ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ పేరునా నిర్వహాకులు రూ.కోట్లలో వసూళ్లకు పాల్పడి మోసం చేశారని తేరుకుని బాధితులు కాచిగూడ పోలీస్ అధికారులకు పిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టి న్యాయం చేయాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు.టంగుటూరి రామకృష్ణ,వనపర్తి మల్లికార్జున్ బాధితులు ఎవరైనా ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి 9393202615 యందు సంప్రదించాలని ప్రేమ్ గాంధీ తెలిపారు.దీనిపై పూర్తి వివరాలను సేకరించి మరోసారి పత్రికాముఖంగా తెలియజేస్తామని ఆయన తెలిపారు.